www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 నవంబర్ 2023

బ్యాడ్మింటన్‌లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ఇసిఇ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.లయ, మూడవ సంవత్సరం విద్యార్థి బి.ఆమోస్ షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనపరిచి అనంతపురం జెఎన్‌టియు ఇంటర్ యూనివర్సిటీ ఎంపికల్లో యూనివర్సిటీ టీంకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కర్నూలు రవీంద్రా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన మహిళలు, పురుషుల షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలో లయ, ఆమోస్ ప్రతిభ కనపరిచారని పేర్కొన్నారు. విద్యార్థిలను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

వరుణుడి అలక...రైతుల కలత..

- రబీలోనూ బీళ్లుగా భూములు
- ఎండిపోతున్న మామిడి చెట్లు
- వర్షాభావ పరిస్థితులతో రైతులు విలవిల

ప్రజాశక్తి-వీరబల్లి

గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఫలితంగా భూగర్భజలాలు అడుగంటాయి. మరోవైపు చెరువులు, కుంటలు, కాలువల్లోనూ చుక్కనీరు లేకుండా పోయింది. ఇప్పటికే ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోయాయి. మరోవైపు రబీ ప్రారంభమై మూడు వారాలు కావస్తున్నా వరుణుడు జాడ లేకపోవడంతో ఈ సీజన్ సైతం కోల్పోవలసి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 12 పంచాయతీలు ఉన్నాయి, డి.రాచపల్లి, వంగిమళ్ల, సోమవరం, సంఘంవాండ్లపల్లి, పెద్దివీడు, మట్లి, ఒదివీడు, తాటికుంటపల్లి, సానిపాయ, గుర్రప్ప గారి పల్లి, వీరబల్లి, గడికోట, పంచాయతీలోనూ మామిడి తోటలు, వేరుశనగ, వరి, పొద్దుతిరుగుడు, కూరగాయల పంటలు, బొప్పాయి పంటలు, ఎక్కువగా సాగు చేస్తారు. ఈ క్రమంలోనే గత నెలలో పొలాలను దుక్కి చేసి, ఎరువులు చల్లి సిద్ధం చేశారు. అప్పటినుంచి అప్పుడప్పుడు మేఘాలు ఊరిస్తున్నా చినుకు మాత్రం రాలడం లేదు. కనీస స్థాయిలోనూ పదును లేక వ్యవసాయ దారులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. వేసవిని తలపించేలా పగటి ఉష్ణోగ్రతలు నమోదవు తుండడంతో రైతులు నాటుకున్న మామిడి చెట్లు తీవ్ర వర్షాభావంతో ఎండిపోతున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సాగునీరు, తాగునీరు, ఇస్తామని ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని రైతులు తెలుపుతున్నారు. ఖరీఫ్ సీజన్ పంట నష్ట పరిహారం కూడా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పక్క మండలాలైన గాలివీడు, రామాపురం, మండలాలకు వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కాలువలతో చెరువులు, కుంటలు, నీటితో నింపుతున్నారు. వీరబల్లి మండలానికి ఏ ప్రాజెక్టు నుంచి నీళ్లు రావని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జళకల అనే పేరు పెట్టి రైతులకు రెండు ఎకరాలకు ఒక బోరు చొప్పున వేస్తామని చెప్పి, బోర్లు వేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని రైతులు తెలిపారు. దశాబ్దాలుగా మండలాల ప్రజల హంద్రీ-నీవా నీటితో చెరువులు నింపే ప్రక్రియ కలగానే మిగిలింది. పాలకులు, అధికారులు, ప్రతిపాదనలతోనే సరి పెడుతున్నారు. అడుగు ముందుకు పడింది లేదు. వీరబల్లి మండల ప్రజలు కేవలం వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి శాశ్వత సాగునీటి కాలువలు, జలాశయాలు లేవు. మండలంలో అక్కడక్కడ కొన్ని పంచాయతీల్లో చిన్నచిన్న చెరువులు, కుంటలు, ఉన్నాయి. వెలుగల్లు ప్రాజెక్టు ద్వారా వీరబల్లి మండలంలో చెరువులను, కుంటలను, నీటితో నింపితే మండలం సస్యశ్యామలంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నీటితో గంగనేరు చెరువును నీటితో నింపి, ఫారెస్ట్ లైనును ఆనుకుని ఉన్న కాలువను రిపేర్ చేయించి, నీళ్లు నింపితే మూడు గ్రామాల ప్రజల పంట పొలాలకు నీరు అందించవచ్చని ప్రజలు చెప్తున్నారు. ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవేదనతో ఉన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు, స్పందించి రైతుల గోడు, పట్టించుకుంటారని వెలుగులు ప్రాజెక్టు నీటితో చెరువులను, కుంటలను, నింపి పంట పొలాలకు నీరు ఇవ్వాలని కోరుకుంటున్నారు.

దుక్కి చేసి, వర్షం జాడ లేక వదిలేసిన పంట పొలాలు

వర్షాభావంతో ఎండిపోయిన వేరుశనగ పంట

క్రికెట్..క్రికెట్..

నేడు ఇండియా-ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్
ఆర్ట్స్ కళాశాల మైదానంలో భారీ స్క్రీన్
జిల్లా యువతలో ఉత్కంఠ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాను క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. మూడు వారాలుగా ఐసిసి దేశంలో క్రికెట్ ప్రపంచకప్ నిర్వహిస్తోంది. ఇండియా వరుసగా 9 లీగ్, సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. లీగ్, సెమీస్ దశలను దాటుకుని ఫైనల్‌కు చేరుకుని తుదిపోరుకు సిద్ధమైంది. ఆదివారం నాటి ఫైనల్ మ్యాచ్‌ల్లో విజయం సాధించిన జట్టు ప్రపంచ విజేతగా నిలవనుంది. ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు ప్రజల్లో ఎనలేని ఆసక్తి నెలకొంది. ఇండియాకు గట్టి ప్రత్యర్థిగా ఆస్ట్రేలియా నిలిచింది. ఇండియా, ఆస్ట్రేలియా జట్లు సమవుజ్జీలుగా పరిగణింపబడుతున్న నేపథ్యంలో క్రికెట్ గేమ్ పట్ల తీవ్ర ఉత్కంఠ నెలకొంది. క్రికెట్ పట్ల ఎనలేని ఆసక్తి కలిగిన అభిమానుల అభిరుచికి అనుగుణంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో భారీ స్క్రీన్, నగరంలోని పలు కూడళ్లలో పోస్టర్లను ఏర్పాటు చేసి లైవ్ మ్యాచ్‌ను తిలకించే ఏర్పాట్లు చేసింది.

పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేయనున్న కడప ఆర్ట్స్ కళాశాల మైదానం

ఏర్పాట్లలో జిల్లా క్రికెట్ అసోసియేషన్

కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో సెమీఫైనల్ వీక్షణ తరహాలోనే జిల్లా క్రికెట్ అసోసియేషన్ భారీస్క్రీన్‌ను ఏర్పాటు చేస్తోంది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డిప్రసాద్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానానికి వేలాది మంది హాజరు కానున్న నేపథ్యంలో భారికేడ్ల సహాయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. వీక్షకులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని జిల్లా పోలీసులను కోరినట్లు సమాచారం. ఫైనల్ మ్యాచ్ కావడంతో మైదానం ఈలలు, కేకలతో ప్రతిధ్వనిం చనుంది.

బెట్టింగ్ భరతం పట్టేనా?

వర్తమాన ప్రపంచంలో సమవుజ్జీలుగా పరిగణన పొందుతున్న ఇండియా-ఆస్ట్రేలియా జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కావడంతో బెట్టింగ్ భారీ ఎత్తున సాగే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఒకవైపు పోలీసులు హెచ్చరికలు, మరోపక్క ఆధునిక సాంకేతికత సహాయంతో బెట్టింగ్ కొనసాగే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఆధునిక యాప్‌లు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో బెట్టింగ్‌ను అడ్డుకోవడం కష్టసాధ్యమని చెప్పవచ్చు. సెమీస్ సందర్భంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసి పులివెందుల తదితర ప్రాంతాల్లో కొంతమంది బెట్టింగ్‌రాయుళ్లను అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో మిగిలిన బెట్టింగురాయుళ్లు మరిన్ని జాగ్రత్తలు తీసుకునే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

కేశాలు దానం చేసిన జశ్వితకు మొక్క అందజేస్తున్న సిద్దిక్

కేన్సర్ రోగులకు కేశదానం

ప్రజాశక్తి-మదనపల్లె

కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. శనివారం హెల్పింగ్ మైండ్స్ పుంగనూరు ఇన్‌ఛార్జి ప్రకాష్ కుమార్తె జశ్విత పుట్టినరోజు సందర్భంగా కేశాలు దానం చేసి ఆదర్శంగా నిలిచింది. జశ్వితకు ప్రశంస పత్రంతో పాటు పూలమొక్క బహుకరించి అభినందించించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ మాట్లా డుతూ వయసులో చిన్న వారైనా సేవా గుణంలో గొప్ప మనసును చాటు కుంటూ చిన్నారులు, యువతులు కేశాలు దానం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇప్పటికే 41 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేసారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ బాధితులకు ఎవరికైనా విగ్గులు కావాలంటే తమ సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు విహాసిని, అమీన్, అర్షియా, సభ్యుల పాల్గొన్నారు.

రేపటి నుంచి కార్తీక మహోత్సవాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తిరుమల తిరుపతి దేవస్థానంల హిందూ ధర్మ ప్రచార పరిషత్తు అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ సోమవారం నుంచి 27వ తేదీ సోమవారం వరకు ఎనిమిది రోజులపాటు కార్తీక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణలు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మన్నూరులో వెలసిన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి హరికథ, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు ఉంటాయన్నారు. ఆలయ అర్చకులు ధరణీశ్వర శర్మ, డాక్టర్ సి.వి.నారాయణ శర్మ, భవానీ ప్రసాద్, లక్ష్మయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు

- జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేసి పేద, బడుగు బలహీన వర్గాలు, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగు నింపడమే టిడిపి లక్ష్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని టిడిపి ప్రవేశపెట్టిన ఆరు పథకాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. పీలేరు పట్టణ ప్రచారంలో దూకుడు పెంచారు. తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా అందరికీ ఏడాదికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని, ఆడబిడ్డ నిధి పథకం కింద18 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.15 వేలు అందించనున్నట్లు చెప్పారు. యువగళంనిధి పథకం ద్వారా నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3 వేలు ఇస్తూ పూర్ టు రిచ్ పథకంతో పేదలను సంపన్నులు చేయడమే టిడిపి లక్ష్యమన్నారు. టిడిపి, జనసేన కలిసి ఇంటింటి బాట చంద్రబాబు మాట నినాదంతో టిడిపి ప్రవేశ పెట్టిన పథకాల ఉమ్మడి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బెజవాడ దినేష్, రవి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

పీలేరులో ప్రచారం చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి

- ఆర్‌జెడి మార్తాల వెంకట కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థి దశ నుంచే పరిశోధనలను ప్రోత్సహించినట్లయితే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని కడప పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు మార్తాల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాయచోటి డైట్‌లో ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టడానికి సైన్స్ ప్రాజెక్టులతో కూడిన విజ్ఞానమేల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సైన్స్‌ను మానవాభివృద్ధికి ఉపయోగప డేటట్లు చేయడం బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులను అన్ని సైన్స్ కార్యక్రమంలో పాల్గొనేటట్లు ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో అన్ని సైన్స్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులను అభినందించారు. 'ఆరోగ్యం, సమాజ శ్రేయస్సు కోసం పర్యావరణాన్ని అర్థం చేసుకోవడం' అనే ఇతివృత్తం ఆధారంగా బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నామని చెప్పారు.విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని సూచించారు. శిక్షణ తర్వాత పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించడానికి మొదట బేస్ లైన్ టెస్ట్ నిర్వహించాలన్నారు. అనంతరం చదువులో వెనుకబడిన విద్యార్థులను గ్రూపులుగా విభజించి వారిలో విద్యా ప్రమాణాల పెంపుదలకు కృషి చేయాలన్నారు. దానికోసం ప్రత్యేక బోధన పద్ధతులను ఉపాధ్యాయులు అనుసరించాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా వ్యాప్తంగా 112 మంది బాల శాస్త్రవేత్తలు తమ పరిశోధనా ప్రాజెక్టులను సమర్పించగా, ఏడు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వాటిలో బురకాయల కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆఫ్రా, చిట్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివ దీక్షిత, అదే పాఠశాలకు చెందిన లక్ష్మీ త్రివేణి, రాయచోటి ఆదర్శ పాఠశాలకు చెందిన జాహ్నవి, అదే పాఠశాలకు చెందిన నిషిత, పోలోపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లేఖన సాహితీ, నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చాణక్య ఉన్నారు. కార్యక్రమంలో ఆప్‌కాస్ట్ జిల్లా సమన్వయకర్త రవీంద్రారెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ రవిశంకర్ రెడ్డి, స్కౌట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ, అసిస్టెంట్ ఎఎంఒ షమీవుల్లా, ట్రైనింగ్ ఇన్‌ఛార్జి రెడ్డయ్య, రాష్ట్ర అబ్జర్వర్ డేవిడ్, రిసోర్స్ పర్సన్స్ నరసింహులు, మధుమతి, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డి

'కలామ్స్ విజన్-23'ని విజయవంతం చేయాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, నిర్వాహకులు

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటిలోని ఇంటర్నేషనల్ మెరిట్ హైస్కూల్‌లో ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహించబోయే కలామ్స్ విజన్-2023 సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని శాసనసభ్యులు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయలో ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ రూపొందించిన కలామ్స్ విజన్ సైంటిఫికల్ ఎక్స్‌పో కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనల పెంపొందించడానికి సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. అనంతరం ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యార్థిని విద్యార్థులు అందరూ తమ ప్రాజెక్టులను ప్రదర్శించవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం 6281453550, 9391932752లలో సంప్రదించాలన్నారు. ప్రాజెక్ట్ రూపొందించిన ప్రతి విద్యార్థికీ ప్రశంస పత్రం, జ్ఞాపికను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉండే ప్రతి ఒక్క పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలనికోరారు . కార్యక్రమంలో డిఇ చంద్ర శేఖర్ రెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సదస్సులే విద్యార్థి పరిశోధన జ్ఞానానికి ఆధారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అధ్యాపకుడికి, విద్యార్థికి పరిశోధన జ్ఞానానికి జాతీయ సదస్సులే ఆధారమని ఎపి స్టేట్ ఫార్మసి కౌన్సిలర్ డాక్టర్ విలియం కేరి అన్నారు. శనివారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో బయో ఫార్మా సంబాద్-2023 జాతీయ సదస్సు రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ సదస్సులే అధ్యాపకుడికి, విద్యార్థికి పరిశోధన జ్ఞానానికి ఆధారమని తెలిపారు. ఒక సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఒక నెల గ్రంథాలయం విద్య అభ్యసనకు సమానమన్నారు. కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఈ సదస్సు హర్షణీయమని, కళాశాల ఔషధ మొక్కల తోటలో పలు మొక్కలతో ప్రదర్శన నిర్వహించి వాటి ఔషధ విలువలను తెలపాలని కోరారు. మెయిన్ స్ప్రింగ్స్ ఆన్లైన్ ట్రైనింగ్స్ ఎమ్‌డి కె.బసప్ప మాట్లాడుతూ ఈ వేదికలో నిమోనియా హెర్బల్ షాంపు, తల సేమియా వ్యాధి, ఆకుమందులతో కేన్సర్‌పై పోరాటం, హెల్తీ డైట్ ఫర్ బ్రెడ్ ఫుల్ డిసీజెస్, కరోనరీ హార్ట్ డిసీస్ మొదలగు పత్ర ప్రదర్శనలు ఉపన్యాసాలు ఎంతో పరిజ్ఞానాన్ని అందించాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓరల్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సైంటిఫిక్ మోడల్స్‌లో చాలా చక్కటి పోటీ ప్రదర్శన చేశారని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో కళాశాల కార్యదర్శి సి.గంగిరెడ్డి, కోశాధికారి సి.అభిషేక్‌రెడ్డి, చైర్మన్ రామచంద్రారెడ్డి, డాక్టర్ పి.అనిత, కార్యక్రమ కార్యదర్శి ఎం.మధు, ఇ.గిరీష్ కుమార్, సమన్వయకర్తలు డాక్టర్ ఎం.దీప, వై.ప్రదీప్ కుమార్, డాక్టర్ డి.గిరి రాజశేఖర్, డాక్టర్ ఎం.ప్రమోద్, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విలియం కేరి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు వెంకటరమణ తెలిపారు. శనివారం వైష్ణవి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు నమోదు, నోటుకు ఓటు-అభివృద్ధికి లోటు, మత్తు పదార్థాలు, మద్యం వలన కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, వైజ్ఞానిక స్పృహ, సామాజిక స్పృహ, రక్తదానం మొదలగు అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటికి భావిభారత పౌరులని, నవ సమాజ నిర్మాణంలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి సామాజిక సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బాబు, హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు మల్లెల రాజేష్, నీలపూజ మణి, శరత్ బాబు, ఆనంద్ ఆచారి, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-మదనపల్లె

రైతులకు గిట్టుబాటు ధర రావాలన్నా, యువతకు ఉపాధి కావాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు రెడ్డి సాహెబ్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని సిటిఎంలో యువ రైతుతో వ్యసాయ పొలంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు వై.సురేంద్రరెడ్డి, చలపతి, పాలేటి, డాక్టర్ ఎస్‌కె బాషా పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పదవ తరగతి పరీక్షల పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని శనివారం పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర్ అన్నారు. శనివారం ఎంఇఒ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ నిబంధనల ప్రకారం అన్ని కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలలో పదవ తరగతి పరీక్ష ఫీజు రూ.125 ఉండగా రూ.400 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారన్నారు. ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు మండల నాయకులు సుదర్శన్, సింగల్ రాయుడు, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులుగా 'కోనేటి'

ప్రజాశక్తి-పీలేరు

అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులుగా కోనేటి పరశురాం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శనివారం వాల్మీకిపురం వెళ్లి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో తనకీ పదవి ఇచ్చిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్‌రెడ్డి, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కె.వి.పల్లి మాజీ జడ్‌పిటిసి గుండ్లూరి జయరామచంద్రయ్య, వైఎస్‌ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు చిన్న యల్లప్ప, నాయకులు అక్కులయ్య, రమణయ్య, రమణా నాయక్, మస్తాన్, రమణారెడ్డి పాల్గొన్నారు.

పరశురామ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు నిమ్మనపల్లి జడ్‌పి హైస్కూల్ (తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అంజన్‌లలీఖాన్ తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పాఠశాల క్రీడల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో రాణించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. టెన్నికాయిట్ అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని ఎస్.మహిత, పి.రెడ్డిలోక్షేణు చిత్తూరు జట్టుకు ఎంపికయ్యారని త్వరలోనే ఏలూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. అండర్-17 విభాగంలో విభాగంలో హై జంప్‌లో 9వ తరగతి విద్యార్థి ఎస్.ఈషనుమ్ ఎంపిక కాగా త్వరలో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొం టారని తెలిపారు. అండర్-14 సంవత్సరంలోపు ఫుట్‌బాల్ పోటీలలో 7వ తరగతి విద్యార్థి బి.ప్రత్యూష ఎంపికైనారన్నారు. పాఠశాల క్రీడా పోటీలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యేందుకు కృషిచేసిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు భద్రయ్యను, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తక్షణ సాయం అందిస్తున్న అధికారులు

మృతి చెందిన బాధితుడి భార్యకు వైఎస్ఆర్ బీమా ద్వారా తక్షణ సహాయం కింద రూ.10 వేలు సచివాలయ సిబ్బంది అందించారు. మండల నగర పంచాయతీ,తూకాలం వారిపల్లె సచివాలయం-1 పరిధిలో నివాసం ముంటున్న బి.ఉత్తన్న అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, కమిషనర్ మనో హర్ ఆదేశాల మేరకు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ మౌలా, స్థానిక వాలంటీర్ మృతుడి ఇంటికి వెళ్లి మృతుడి భార్య బి.శివమ్మకు నగదును అందించారు. తక్షణ సాయం అందజేసిన ఒకటో సచివాలయం కన్వీనర్ జివిం చాంద్‌బాషా, టి.జనార్ధన్‌కు సచివాలయ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాయచోటి జిఎమ్ ఎమర్జెన్సీ మల్టీ స్పెషల్టీ ఆస్పత్రి, ఆమీన్ మెడికల్ స్టోర్ సహకారంతో వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా మండలంలో గ్రామీణ ప్రజలందరికీ కరపత్రాలు అందించి తెలియజేసామని అన్నారు. ప్రతి ఏడాది మండలంలో నూతన వైద్యుల చేత ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని అన్నారు. వైద్య నిపుణులు డాక్టర్ టి.జయప్రకాష్‌రెడ్డి, డాక్టర్ అబ్దుల్‌గని, డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ వరప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బింద వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-కలకడ

భోజనాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు

మండలంలోని బాట వారిపల్లి కాలనీ సమీపంలో ఉన్న చిత్తూరు-కర్నూలు జాతీయ రహ దారిపై వెలసిన పంచముఖ ఆంజ నేయస్వామి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఉచితంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయధర్మకర్త, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎల్లప్ప తెలిపారు. జాతీయ రహదారి ప్రక్కన ఉన్న ఆలయం కావడంవల్ల భక్తులు, బాటసారులు అనేకమంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలి పారు. ఆకలితో ఉన్నోళ్ళ వారి ఆకలిని తీర్చడం లోని ఆనందం అన్నారు. కార్యక్ర మంలో ఏ.వి.నాగన్న, ఆలయ పూజారి రమేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు స్ఫటిక శివలింగ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలం పరిధిలోని బీరంగి గ్రామం, గూగూటికోనలోని శ్రీజయదేన్న స్వామి ఆలయంలో ఆదివారం స్ఫటిక శివలింగ ప్రతిష్టాపన మహో త్సవం, 221 విగ్రహాల ప్రతిష్టాపన, ధ్యాన మందిరం ప్రారంభోత్సవం ఉంటుందని ఆలయ పీఠాధిపతి, ధర్మకర్త పగడాల లక్ష్మీపతిస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఎక్కడాలేని విధంగా 221 విగ్రహాల ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని హత్యరాల గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కాలిపోయిన బాధితులను శనివారం టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు పరామర్శించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. కుటుంబసభ్యులకు తనవంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, హత్యరాల మాజీ దేవస్థానం చైర్మన్ వెంకటేశ్వర్లు నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ రాజు, టిఎన్ఎస్ఎఫ్ పార్ల మెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, రోహిత్ నాయుడు, శివప్రసాద్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, నాగేంద్ర తులసి, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రోడ్లన్నీ గుంతలమయం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి ప్రభుత్వ పాలనలో రోడ్లన్నీ గుంతలమయంగా మారి పోయాయని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆరోపించారు. టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి సారధ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు దారేది అనే కార్యక్రమం ద్వారా శనివారం మండల పరిధిలోని తాళ్లపాక తోపాటు పట్టణంలోని కడప-తిరుపతి జాతీయ రహదారిపై వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రాజు మాట్లాడుతూ జగన్ పరిపాలనలో రోడ్లన్నీ అధ్వాన్నంగా మారి గుంతలమయమై ప్రయాణం నరక ప్రాయంగా మారిందన్నారు. మరలా రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ప్రజలను మభ్యపెట్టడానికి వై నీడ్స్ జగన్ ఎపి అనే కార్యక్రమాన్ని చేస్తున్నారని నిజంగా జగన్ ప్రభుత్వం అవసరమా అని ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని అటకెక్కించి అప్పులు పాలు చేయడమే కాకుండా పేదల నడ్డి విరిచేలా విద్యుత్‌బిల్లులు, బస్సు చార్జీలతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గన్నేసుబ్బనరసయ్య నాయుడు, పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, మహిళా అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, శవనవారిపల్లి సర్పంచ్ కోటయ్య నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్‌రాజు, సీనియర్‌నాయకులు జి.వి సుబ్బారాజు, యువ నాయకులు సూర్యనారా యణరాజు, నాగేంద్ర, వెంకటేష్ యాదవ్, సుబ్రహ్మణ్యం, తాళ్లపాక సీనియర్ నాయకులు అంజన్ రాజు, రాజశేఖర్‌రాజు, రామ గోవిందు రాజు, ఉమా మహేశ్వరరాజు, రామ్మోహన్‌రాజు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పోలి శివకుమార్ పాల్గొన్నారు. **ములకలచెరువు :** రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో రోడ్లన్నీ ఉయ్యాల జంపాల అన్నట్లుగా తయారయ్యాయని మండల టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ధ అన్నారు. శనివారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గం ఇన్‌ఛార్జి జి.శంకర్‌యాదవ్ సూచనల మేరకు మండల టిడిపి అధ్యక్షులు పాలగిరిసిద్ధ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామ అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కెవి.రమణ, కేశవులు, వెంకటస్వామి, నారాయణస్వామి, సుబ్బి నాయుడు, కక్కల సుదర్శన్, శివన్న ,రెడ్డప్ప, మాజీ ఎంపిపి నరసింహులు, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు. **పీలేరు :** గంతలు కట్టుకున్న వైసిపి పాలకులకు రోడ్లపై గుంతలు కనిపించడంలేదా అంటూ టిడిపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియో జకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి దినేష్ తమ కార్యకర్తలతో కలిసి కళ్ళు మూసుకు పోయిన వైసిపి ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. పీలేరు పట్టణం, తిరుపతి రోడ్డులోని సింగల్ విండో కార్యాలయం ఎదురుగా రోడ్డుపై గుంతలు చూపిస్తూ నిరసన తెలిపారు.

రాజంపేట : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

గ్రంథాలయాలతో జ్ఞానార్జన : కమిషనర్

బి.కొత్తకోట : విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న కమిషనర్, ఎంపిడిఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గ్రంథాలయాలతో జ్ఞానార్జన సమకూరుతుందని నగర పంచా యతీ కమిషనర్ పిఆర్.మనోహర్, ఎంపిడిఒ శంకరయ్యలు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాల గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు నైనారు మధుబాల ఆదేశాల మేరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బి.కొత్తకోట శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహి ంచారు. ఈకార్యక్రమానికి కమిషనర్, ఎంపిడిఒలు హజరై పిల్లలకు బహు మతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రంధాయలధికారి ఎం.తులసి నాయక్ మాట్లాడుతూ పిల్లలు కొరకు ప్రత్యేకంగా 50 రూపాయలకే సభ్యత్వం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు. రాజ్యలక్ష్మి, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. **కలకడ :** విద్యా ర్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించినట్లు కలకడ శాఖ గ్రంధాల అధికారి అమర్నాథ తెలిపారు. మండల కేంద్రమైన కలకడ బృందావనంలో 56వ గ్రంథం వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, వంటి పోటీలను నిర్వహించినట్లు తెలిపారు.స్థానిక బాట వారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో గెలు పొందిన విద్యార్థులకు ఈనెల 20న గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొ న్నారు. **పీలేరు:** 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ప్రధాన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్, చిత్రలేఖనం వంటి పోటీలు పీలేరు శాఖా గ్రంథాలయాధికారి అమర్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కె. భాస్కర్ అధ్యక్షతన ఈ కార్యక్ర మాన్ని నిర్వహించామని అన్నారు. 20న విజే తలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. **మదనపల్లె:** కురబలకోట గ్రంధాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు భాగంగా స్థానిక జడ్‌పిహైస్కూల్ 6, 7వ తరగతుల విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకత గురించి, 8,9,10 తరగతుల విద్యార్థులకు చట్టాల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహిళ సాదికారత పోటీలు, మ్యూజికల్ చైర్స్, జాతిపిత గాంధీజీ చిత్రపటం పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి బి.చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు త్రివేణి, ఎం.నాగమణి. వి.వెంక టశివయ్య. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే ఫలితం సాధ్యం :'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

సమిష్టి కృషితోనే ఫలితం సాధ్యమవుతుందని స్థానక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వెల్లడించారు. శనివారం పట్టణంలోని అజయ్ ఫంక్షన్‌హాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కష్టపడి సైనికుడిలాగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసీపీ అధికారంలోకి రావచ్చని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ముస్లిం మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అనేక రకాల సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి పథకాలు అందించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి జగన్‌ను మళ్ళీ సిఎంను చేయాలని కోరారు. మాజీ మార్కెట్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాలో అవకతవకలు లేకుండా దొంగఓట్లకు తావు లేకుండా ప్రతి కార్యకర్త బూతుల లో ఓట్లను పరిశీలించి లేని ఓట్లను అక్కడికక్కడే పరిష్కరించి ప్రతి ఓటును పరిశీలించాలని తెలిపారు. ఎక్కడైనా డబుల్ ఎంట్రీలు ఉండే వారిని గుర్తించి సరిచేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, జడ్‌పిటిసి పద్మజ, లోకవర్ధన్, కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, సింగల్ విండో చైర్మన్ నల్లారి శ్రీకర్ రెడ్డి, జిల్లా ఎస్‌సిసెల్ కార్యదర్శి వి హరి, వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్ రెడ్డి, జెఎసి కన్వీనర్ రెడ్డప్ప, ముస్లిం మైనార్టీ నాయకులు వేంపల్లి ఫయాజ్ వేంపల్లి బావాజీ, ఎంపిటిసిలు సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

అట్టహాసంగా ప్రారంభమైన కబడ్డీ పోటీలు

జ్యోతి ప్రజ్వలన చేసి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర 13 జిల్లాల కబడ్డీ క్రీడాకారులకు వేదికగా నిలిచింది. 67వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్సీ యం.వి.రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఐపిఒ భానుమూర్తిరాజు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. శనివారం మొదలుకొని, ఆది, సోమవారాలలో మూడు రోజులపాటు పోటీల జరుగుతాయని క్రీడా ఆర్గనైజర్ సెక్రటరీ పీడీ డేవిడ్‌ప్రసాద్ తెలిపారు. 13 జిల్లాల నుంచి 13 బాలురు, 13 బాలికల జట్లు 350 మంది క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. వచ్చిన వారందరికీ వసతులను సిద్ధం చేశామన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్‌జిఎఫ్ఐ సెక్రటరీ వసంత మాట్లాడుతూ ముందు ఎన్నడూ లేనివిధంగా క్రీడాకారులకు ప్రయాణపు ఖర్చులు, క్రీడా దుస్తులు ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఈ క్రీడలకు చిట్వేలిని ఎంపిక చేయడంలో రాష్ట్ర వ్యాయామ విద్య తనిఖీ అధికారి భాను మూర్తిరాజు, పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్, సమగ్ర సర్వ శిక్ష అభియాన్ అధికారి శ్రీనివాసరాజు,సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ డైరెక్టర్ పార్వతిల కృషి గొప్పదని అభినందించారు. శారీరక మానసిక ఆరోగ్యానికి కాక విద్య, ఉద్యోగ అవకాశాలకు క్రీడలు ఎంతో ప్రయోజనమని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఉప ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుహాసిని, నరసింహ, షబ్బీర్ అలీ, ఎన్సిసి అధికారి పసుపుల రాజశేఖర్, సిహెచ్ఎస్ బాధ్యులు గాడీ ఇంతియాజ్, పంచాయతీ సిబ్బంది నరసింహ, వెంకటేశు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

ప్రజాశక్తి- నందలూరు

నందలూరు బస్టాండ్‌లో జాతీయ రహదారికి నాలుగు వైపులా స్పీడ్ బ్రేకర్లను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి పర్యవేక్షణలో ఆర్అండ్‌బి అధికారులు ఏర్పాటు చేశారు. ఈ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటును రాజంపేట సిఐ మంజునాథరెడ్డి, స్థానిక ఎస్ఐ అబ్దుల్ జహీర్ పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధానకార్యదర్శి సయ్యద్‌అమీర్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లాఖాన్, వైసిపినాయకులు సుభాన్, రమణ, శివ, నరసింహులు, తుమ్మాది శివకుమార్ పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికొస్తే సహించం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


మాట్లాడుతున్న చమర్తి జగన్మోహన్‌రాజు

టిడిపి కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని ఆ పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మో హన్‌రాజు హెచ్చ రించారు. శనివారం తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా వెరిఫికేషన్ చేస్తున్న టిడిపి మహిళా నాయకురాలు మిరి యాల జ్యోతిపై వైసిపి నాయ కులు దుర్భాషలాడి, దాడి చేశారని, మహి ళలపై అమానుషంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన మిరియాల జ్యోతిని పోలీస్ స్టేషన్‌కు తరలించగా స్టేషన్ వద్ద వెళ్లి ఆమె పరామ ర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయ కులు ఓటమి భయంతోనే ఇటువంటి పిరికిపంద చర్యలకు పాల్పడు తున్నారని, భవిష్యత్తులో ఇటువంటి తరహా ఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణ ామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P No: 91/2016
In
O.S. No: 192/2015

1.ఆకుల సావిత్రమ్మ భర్త నారాయణ,
2.ఆకుల శారదమ్మ భర్త రమణయ్య, ఇరువురి నివాసం అనంతయ్యగారిపల్లె గ్రామం మరియు పోస్ట్ పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...డిక్రీ హెూల్డర్స్

వర్సెస్

ఆకుల వెంకట్రాయులు మరణించి నందువలన అయన వారసుడు
ఆకుల శ్రీనివాసులు తండ్రి లేట్ వెంకట్రాయులు, అనంతయ్యగారిపల్లె గ్రామం మరియు పోస్ట్, పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...జే.డి.ఆర్

జె.డి.ఆర్.కు నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా, పై తెలిపిన డిక్రీ హెూల్డర్స్ మీ పైన, పై తెలిపిన ఈ.పి. దాఖలు చేసివున్నారు, సదరు ఈ.పి. పై కోర్టులో 21.12.2023 న వాయిదా వున్నది. కావున మీరు స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ పై కోర్టులో 21.12.2023న ఉదయం 10.30 గంటలకు హాజరై జవాబు దాఖలు చేసుకోవలెను. అట్లు లేని యెడల, మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// బై ఆర్డర్ అఫ్ ది కోర్ట్//
ఎస్. కృష్ణ కుమార్,
ఎస్. గిరీష్ కుమార్,
న్యాయవాదులు, రాజంపేట.

మహారాజశ్రీ రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No : 18/2022

సయ్యద్ జమీర్ తండ్రి హుస్సేనయ్య
చిట్వేల్ టౌన్ & మండలం అన్నమయ్య జిల్లా. ...పిటిషనర్

వర్సెస్

షేక్ మహబూబ్ బాషా తండ్రి హనీఫ్ కుమ్మరవీధి, చిట్వేల్ టౌన్ & మండలం అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్ నెం.1

పైన తెల్పిన పిటిషనరు, రెస్పాండెంట్ అయిన నీపైన తనను దివాలుదారుగా తీర్మానించమని పైకోర్టులో I.P.No. 18/22 దాఖలు చేసియున్నారు. మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల 04.01.2024 తేదిన ఉదయం 10.30 గంటలకు స్వయంగా కానీ, లాయర్ ద్వారా కానీ పై కోర్టులో హాజరై మనవి చేసుకోగలరు. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును.

// బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
వి.వి.రమణ
పిటిషనరు పరం అడ్వకేటు,
రాజంపేట.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : MADANAPALLE
O.S.No. 231 OF 2022

M.Ramanamma. ...Plaintiff
Vs
M.Bhaskar Rao. ...Defendant

SUIT SUMMONS TO DEFENDANT

To,
Sri M.Bhaskar Rao, S/o M.Ramaiah, D.No.3-158-C-7, SBI Colony, B.K.Palle, Madanapalli Town & Post, Annamayya District.

Please take notice that the above suit O.S.No.231 of 2022 Filed by the Plaintiff against you, is posted to 04-12-2023 for your appearance before the above court, either in person or through an authorised agent by 10.30 A.M. If is fails to make your appearance the matter will be decided in your absence.

//By the Order of Court//
D.MURALI KRISHNA
Advocate,
MADANAPALLE.
Cell:9700322274.

నినాదాలు చేస్తున్న బిఎస్‌పి నాయకులు

బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడుదాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బహుజనుల రాజ్యాధికారం కోసం ఐకమత్యంగా పోరాడాలని బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని న్యూ ఆంధ్ర కల్యాణ మంటపంలో బిఎస్‌పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైల్వే కోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాళ్లపాక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బందెల గౌతం మాట్లాడుతూపెత్తందారీ వ్యవస్థకు స్వస్తి పలికి బహుజనుల రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ బిఎస్‌పి పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి పార్టీని బలోపేతం చేసి రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల, నియోజకవర్గస్థాయి నాయకులను పార్టీలోకి ఆహ్వానించి వారికి సభ్యత్వం, పదవీ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో బిఎస్‌పి జిల్లా అధ్య క్షులు అబ్బవరం యుగేందర్, జిల్లా ఇన్‌ఛార్జి బాలాజీ, రైల్వే కోడూరు నియోజక వర్గ అధ్యక్షులు లేబాకు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి పోలేపల్లి హేమంత్ కుమార్, కార్యకర్తలు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యార్థినులు

విద్యార్థులకు తప్పని కష్టాలు

- నేటికీ నోచని బస్సు సౌకర్యం

ప్రజాశక్తి- రామసముద్రం

మండలంలోని చెంబకూరు కేంద్రంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నారిగానిపల్లి రూటు విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం చెంబకూరు గ్రామం నుంచి పులగూరకోట మార్గంలో ఆర్‌టిసి బస్సు నడపాలని కోరుతున్నారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ గ్రామాల నుంచి వంద మందికి పైగా నారిగానిపల్లి, ఆల్చేపల్లి, కొత్తిండ్లు, ఎగువ లంభం వారిపల్లి, దిగువ లంభం వారిపల్లి, పూలకుంట్లపల్లి గ్రామాల నుండి ఉన్నత పాఠశాల్లో చదువుకునేందుకు నిత్యం కాలినడకతో పాఠశాలలకు చేరుకుంటున్నామని వర్షాకాలంలో రాకపోకలు సాగించాడు ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రభుత్వ అధికారులు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించి బస్సు పాసులు అందచేయాలని. చాలా కాలంగా పాఠశాలకు వెళ్లేందుకు డబ్బు ఉన్న విద్యార్థులు ఆటోలలో ప్రయాణం చేస్తున్నారని అన్నారు. తామంతా పేద, వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో తమ తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఈ మార్గంలో పులగూరకోట నుంచి వచ్చే బస్సును నిలుపుదల చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఉదయం 8 గంటలకు, సాయంత్రం నాలుగు గంటలకు పైగా సర్వీసు పునరుద్దరించాలని కోరారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరిం చాలని ఎస్ఐ మల్లి కార్జునరెడ్డి తెలి పారు. శు క్రవారం లక్కి రెడ్డిపల్లి కోర్టు సమీపంలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వాహనదా రులకు కౌన్సె లింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనానికి సంబం ధించిన అన్ని పత్రాలు ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్య లు తప్పవన్నారు. ట్రాఫిక్ నియంత్రణలు పాటించాలని, ఆటో డ్రైవర్లు అధిక లోడు వేసుకొని సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ ఆటో నడుపుతూ ఉంటారని ఇలా చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్‌లో మాట్లాడకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పది లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని బండ్లపై గ్రామం సమీపంలో గుర్రప్ప కుమారుడు మోహన్‌కుమార్(23)అనే వ్యక్తి నాటు సారాను తీసుకువచ్చి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింద న్నారు. ఆ సమాచారం మేరకు శనివారం నాటుసారా విక్రయ స్థావరంపై దాడి చేసి మోహన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

కారు, స్కూటర్ ఢీ : ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కారు ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని చిన్నల్లవారిపల్లెకు చెందిన ఎస్.మహమ్మద్‌అలీ (49) సొంత పనుల నిమిత్తం తన ద్విచక్ర వాహనంలో బాలినాయనపల్లెకు వెళ్ళుతుండగా పాత కొండసానివారిపల్లి వద్ద మలుపులో ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో మహమ్మద్ అలీ కి కాలు విరిగిందన్నారు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది అమర్నాథ్, వాణి సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని నిమ్మనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఈఘటనపై కేసునమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ముగ్గురికి..

చిన్నమండెం: మండలంలోని కడప-బెంగళూరు జాతీయ రహదారిపై మల్లూరు క్రాస్ వద్ద బొలేరో వాహనానికి టైర్ పగిలి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... చిన్నమండెం మండలం, కేశపురం కస్పాకు చెందిన చింతం సోమశేఖర్, అతని కుమారుడు సునీల్ కుమార్ రెడ్డి, ఓద్దిరెడ్డి వెంకటరెడ్డిలు రాయచోటి నుంచి కేశాపురం వస్తుండగా గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు వస్తున్న బులోరా వాహనం మల్లూరు క్రాస్ వద్దకు రాగానే టైరు పగిలి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీట్టిందన్నారు. ఈ ప్రమాదంలో వెంకట్ రెడ్డికి ఒక చెయ్యి పూర్తిగా నుజ్జునుజైందని, సోమశేఖర్ రెడ్డి కి కాలు చేయి గాయాలైనట్లు తెలిపారు. గాపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.